క్లుప్తంగా

జూనోటిక్ వ్యాధులపై అవగాహన



పశువైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ షేక్ ఆసిఫ్

బంగారుపాళెం: జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బంగారుపాళెం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ఆసిఫ్ అన్నారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశు వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జంతువుల నుంచి మనుషులకు జబ్బులు వ్యాపిస్తాయన్నారు. బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, రేబిస్ లాంటి ప్రాణాంతకమైన జబ్బులు వస్తాయని చెప్పారు. ఈ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇళ్లలో పెంపుడు కుక్కలను పెంచుకునే యజమానులు వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాల (ఏఆర్వీ)ని వేశారు. కార్యక్రమంలో నలగాంపల్లె పశు వైద్యశాల డాక్టర్ జాన్సీ, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

చిత్తూరు అర్బన్: నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్ సంచులను ఉపయోగించాలని కోరారు. తడి–పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.

ఘనంగా సహకార దినోత్సవం



జెండాకు వందనం చేస్తున్న సిబ్బంది

యాదమరి(పూతలపట్టు): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ సీఈఓ గుణశేఖర్ సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలోని రైతులు రుణాలను సక్రమంగా చెల్లించి, రెన్యువల్ చేసుకోవాలన్నారు. తద్వారా సంఘ అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సిబ్బంది సిరాజ్‌బాషా పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు నివాళులర్పించారు. శనివారం స్థానిక గంగినేనిచెరువు కట్ట మీద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నడమే కాకుండా సమసమాజ స్థాపన కోసం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ కృషిచేశారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేతలు నాగరాజన్, రమాదేవి పాల్గొన్నారు.

- బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహనికి బీజేపీ నేతలు చిట్టిబాబు నివాళులర్పించారు. సమానత్వం కోసం పోరాడిన ధీశాలి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేశారన్నారు. స్వాతంత్ర్యం కోసం తనవంతు కృషిచేశారన్నారు. నేటి తరం నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పర్యావరణానికి చెట్లే మూలం



బంగారుపాళెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్

బంగారుపాళెం: పర్యావరణ ప్రగతికి పచ్చని చెట్లు సోపానమని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వందనా త్రిపాఠి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. నేటి సమాజానికి వాతావరణ కాలుష్యం పెద్ద సవాలుగా మారుతోందన్నారు. పచ్చని చెట్లను నరికివేయడం వల్ల కలుగుతున్న పర్యావరణ ఇబ్బందులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో.. ఇవి ఉచితం!

- మరుగుదొడ్లు, తాగునీటి వసతి తప్పనిసరి
- ఉచితంగా వాహానానికి గాలి నింపాలి



పెట్రోల్ బంక్

కాణిపాకం: సాధారణంగా మనం పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనానికి పెట్రోలు కొట్టించుకుని వెళ్లిపోతూ ఉంటాం. అక్కడ కేవలం పెట్రోల్ మాత్రమే దొరుకుతుందని భావిస్తాం. అయితే అక్కడ మరిన్ని సేవలు పొందే అవకాశమూ ఉంది. అవి కూడా నిబంధనల మేరకు మనకు అందించాలి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేశాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ జరుగుతుంది. ప్రతి లీటర్‌కు వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంక్‌లో యజమానులు సౌకర్యాలు కల్పించాలి. వీటి గురించి చాలామందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని చాలా పెట్రోల్ బంకుల్లో సేవలు కానరావడం లేదు. కొన్నిచోట్ల టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల గాలి యంత్రాలు పనిచేయడంలేదు.. ఇవి కచ్చితంగా ఉండాల్సిందే

స్వచ్ఛమైన తాగునీరు..

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 123 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటి వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. అక్కడ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మరుగుదొడ్లు

స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనచోదకులు, ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను అనుమతించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. మరిన్ని చోట్ల అసలు మరుగుదొడ్డే కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటర్ పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసినందుకు మనం చెల్లించిన సొమ్ములో నాలుగు నుంచి ఎనిమిది పైసలు వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు ఇస్తున్నాం.

ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే, మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంకును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు..

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులందరికీ ఉంది. దీనికి సంబంధించిన సదుపాయాన్ని బంక్ యాజమాన్యాలు కల్పించాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. అందుకోసం క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ని ప్రదర్శించాలి.

ప్రథమ చికిత్స కిట్..

ప్రతి బంకులో ఫిర్యాదు బాక్స్. రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుల తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఆ ప్రథమ చికిత్స పెట్టెలో మందులు తప్పకుండా ఉండాలి.

ఉచితంగా గాలి

ఉచితంగా వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారుల కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

నిబంధనలు పాటించాలి



నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంక్‌లను నిర్వహించాలి. కచ్చితంగా మరుగుదొడ్లు ఉండాలి. తాగునీటి సదుపాయం కల్పించాలి. వాహనాలకు ఉచితంగా గాలి నింపాలి. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీసు అధికారులు నిత్యం బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం.

– శంకరన్, డీఎస్ఓ, చిత్తూరు

వైఎస్సార్ జయంతి రేపు

ఐరాల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నవెంకటంపల్లె సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉదయ 10 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొ ని విజయవంతం చేయాలని కోరారు.

ఐరాల క్రాస్‌లో..

తవణంపల్లె: మండలంలోని ఐరాల క్రాస్ రోడ్డులో ఈ నెల 8న సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సి.హరిరెడ్డి తెలిపారు.

జోరుగా కలుపుతీత పనులు



కలుపు తీస్తున్న కూలీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండల పరిధిలో వేరుశనగ మొలకెత్తింది. ఇప్పటి వరకు సుమారు 500 హెక్టార్ల వరకు వేరుశనగ సాగైంది. విస్తారంగా వర్షాలు కురవడంతో పంట బాగానే మొలకెత్తింది. అయితే పంటలో కలుపు కూడా ఉండడంతో రైతులు కలుపుతీత పనిలో బిజీగా ఉన్నారు. ఈనెలాఖరుకు మరింత మంది రైతులు వేరుశనగ విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరగవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

త్వరలో పాత బస్టాండ్ పునఃనిర్మాణం



పాత బస్టాండులో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, జేసీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని పాతబస్టాండ్‌ను ప్రజల సౌకర్యార్థం త్వరలో పునఃనిర్మించనున్నట్లు ఎమ్మెల్యే జగన్‌మోహన్ తెలిపారు. శనివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలసి ఆయన పాతబస్టాండ్, వేలూరు రోడ్డులోని రైతుబజార్‌ను పరిశీలించారు. పాతబస్టాండ్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వాళ్లంతా రైతుబజార్‌లో దుకాణాలు పెట్టుకోవాలన్నారు. బస్టాండులో గతంలోలా బస్సులను తీసుకురావడంతో పాటు వాణిజ్య సముదాయం నిర్మిస్తామన్నారు. దీనిపై వ్యాపారులు మాట్లాడుతూ ఇది ముస్లింలకు చెందిన మసీదు స్థలమని, కమిటీ పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. జేసీ మాట్లాడుతూ రైతుబజార్లలో ఎలాంటి రుసుములు లేకుండా రైతులు పండించిన పంటను నేరుగా అమ్ముకోవచ్చన్నారు. అనంతరం కిలో కందిపప్పు రూ.165లకు విక్రయించే కౌంటర్‌ను ప్రారంభించారు. ఆర్డీఓ చిన్నయ్య, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి



కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల: మామిడి రైతులు కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎగువచవటపల్లెలో శనివారం ఆయన గ్రామానికి చెందిన లోకనాథం నాయుడు మామిడి తోటలో కొమ్మల కత్తిరింపుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి చెట్లలో కొమ్మల కత్తిరింపు ప్రక్రియను జాగ్రత్తగా చేయాలన్నారు. మామిడి కోతలు పూర్తయిన తోటల్లో అలాగే గత ఏడాది కాపు రాని తోటల్లో కత్తిరింపులు ప్రారంభించాలన్నారు. సరైన విధానంలో కత్తిరింపులు చేసినప్పుడే చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. తద్వారా మందుల పిచికారీ 2 నుంచి 3 స్ప్రేలు తగ్గించుకోవచ్చని వివరించారు. ఎండిన, అడ్డదిడ్డంగా ఉన్న కొమ్మలను కత్తిరించాలన్నారు. చెట్టు మొదలుపైన సూర్యరశ్మి పడేలా కత్తిరింపులు చేపట్టాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సాగరిక రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



టి.పుత్తూరులో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పైమాఘం, టి.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు 104, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచుకోవాలని సూచించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజనాలబండ భక్తులకు మెరుగైన సేవలు

- టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వెల్లడి
- ప్రతిసేవకు టికెట్ తప్పనిసరి



సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీనివాసరావు

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులకు మెరుగైన సేవలందిచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రాజనాలబండ ఆలయాన్ని ఆయన సందర్శించారు. భక్తులకు విక్రయిస్తున్న సేవా టికెట్లు, అభిషేక పూజల టికెట్లు, రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ప్రతిసేవకు భక్తులు కోరిన మేరకు టికెట్ ఇవ్వాలన్నారు. అధిక ధరలను వసూలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే ఆలయం వద్ద జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- డీపీడీ శివనారాయణ



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీపీడీ

పుంగనూరు: ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఎరువులు, విత్తనాలు, మందులు విక్రయించాలని, నాణ్యత లేని వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ (డీపీడీ) శివనారాయణ హెచ్చరించారు. శనివారం తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, ఏఓ జ్యోతితో కలసి పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరల పట్టికను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. శివనారాయణ మాట్లాడుతూ ఎలాంటి నకిలీ పదార్థాలు విక్రయించినా లైసెన్సులు రద్దు చేసి, షాపులు సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు.

చిత్తూరులో ప్రత్యేక పారిశుధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించారు. మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేశారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికలు తీయించడం, పారిశుధ్య పనులు చేశారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఈ పనులను తనిఖీ చేశారు. వార్డుల్లో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించి, ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన పనులు పూర్తిచేయాలన్నారు. వార్డుల పరిధిలో మీడియం, మైనర్ డ్రైన్లను గ్యాంగ్ వర్క్‌లు నిర్వహించి శుభ్రం చేయించే పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. మేజర్ డ్రైనేజీ కాలువలో జేసీబీలతో చేస్తున్న పూడికతీత పనులపై అధికారులతో చర్చించారు. మొత్తం 40 కిలోమీటర్ల మేజర్ కాలువలు ఉండగా ఇప్పటి వరకు 9.5 కిలోమీటర్ల మేర పూడిక తొలగించినట్లు అధికారులు వివరించారు. ఇదే సమయంలో దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేయాలన్నారు. స్టాప్ డయేరియా, కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణ కోసం నగరపాలక సంస్థ చేస్తున్న పనులకు నగర ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, వ్యర్థాలను కాలువలు, వీధుల్లో పడేయొద్దన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన నీటినే సరఫరా చేయాలి

కాలానుగుణమైన వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా నగరంలో నాణ్యమైన నీటిని సరఫరా చేయాలని, ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు పటిష్టంగా తీసుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఇంజినీరింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. నగరంలో నీటి సరఫరా నాణ్యత, లీకేజీల నివారణ, నీటి శుద్ధి ప్లాంట్ల తనిఖీ అంశాలపై శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డయేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న బోర్ నీళ్లు, ఎన్టీఆర్ జలాశయం నీటి నాణ్యతను రోజూవారీగా పరిశీలించాలన్నారు. వార్డుల వారీగా లీకేజీల నివారణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, ఏఈలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లు శుభ్రం



శుభ్రపరుస్తున్న విద్యార్థులు

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలంలోని లక్ష్మయ్య కండ్రిగ గ్రామంలోని పరిసరాలను వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శుభ్రపరిచారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా ప్రోగ్రాం ఆన్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై మాస్కులు ధరించి గ్రామ పరిసర ప్రాంతాల్లో శుభ్రపరిచారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేకుంటే జబ్బులు వస్తాయని గ్రామస్తులకు తెలియజేశారు. విద్యార్థులు జాహ్నవి, మేఘన, సంధ్య, తేజస్విని, ప్రత్యూష, శ్రావణి, పవిత్ర, వైష్ణవి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా చిత్తూరు- పరదరామి రోడ్డు



జోడిచింతల రోడ్డు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

యాదమరి(పూతలపట్టు): మండల కేంద్రంలోని కొంతమంది వ్యాపారుల నిర్లక్ష్యం వలన జోడిచింతల రోడ్డు డంపింగ్‌యార్డును తలపిస్తోంది. చిత్తూరు–పరదరామి వైపు వెళ్లే దారిలో జోడిచింతల బస్టాండ్ పక్కనే చెత్త, వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, జంతు కళేబరాలతో నిండిపోయి కంపుకొడుతోంది. వర్షం వచ్చినప్పుడు ఆ చెత్తాచెదారాలు వరద నీటిలో కొట్టుకుని రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు, ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు రోడ్డు పక్కనే వేస్తుండడంతో కొన్ని రకాల జబ్బులు వ్యాపిస్తాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సూపర్‌బజార్ ఇన్‌చార్జ్‌గా ప్రసాద్

పలమనేరు: పలమనేరు సూపర్‌బజార్ ఇన్‌చార్జ్‌గా ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. సహకార సంఘ లావాదేవీలతో పాటు ఇందుకు సంబంధించిన అన్ని వ్యవహారాలు ఇకపై ఆయన ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇటీవల ఇక్కడి సూపర్‌బజార్‌లో అక్రమాలు జరిగాయని కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక ఆర్డీఓ విచారణ చేసి సూపర్‌బజార్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ సూపర్‌బజార్‌కు పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించడం గమనార్హం.

మాపాక్షిలో సినిమా షూటింగ్




షూటింగ్ చూసేందుకు వచ్చిన గ్రామస్తులు

కాణిపాకం: చిత్తూరు నగర పరిధిలోని మాపాక్షి ప్రాంతంలో శనివారం ఓ సినిమా చిత్రీకరణ జరిగింది. తెరపై కొత్తగా నటీనటులను పరిచయం చేస్తూ.. శరీరం అనే సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను మాపాక్షి గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద చిత్రీకరించారు. ఈ షూటింగ్ సన్నివేశాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. కాగా జీవీ పెరుమాళ్ ఈ సినిమాకు దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



సినిమా చిత్రీకరణలో యూనిట్

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ గ్లోరియా

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ గ్లోరియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది హాజరు పట్టికను ఆమె పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆరాతీశారు. వర్షాకాలంలో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేయాలని, మంచినీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఈఓపీఆర్డీ శారదా దేవి, సీనియర్ అసిస్టెంట్ రాజేంద్ర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు





గాయపడిన త్రిమూర్తి, జయరామిరెడ్డి

చౌడేపల్లె: మండలంలోని చౌడేపల్లె– సోమల మార్గంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, ఆమినిగుంటకు చెందిన దేవరాజులు కుమారుడు త్రిమూర్తి(25) రెడ్డిపానకుంట సమీపంలోని పొలం వద్దకు వెళ్లాడు. బైక్‌లో కట్టపైనుంచి స్వగ్రామానికి వెళ్లే రోడ్డుకు వచ్చాడు. అదే సమయంలో సోమల వైపునుంచి నెల్లిమంద పంచాయతీ తట్టివారిపల్లెకు చెందిన గంగిరెడ్డి కుమారుడు జయరామిరెడ్డి(55) బైక్ మీద అక్కడికి రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యసేవలకోసం మదనపల్లెకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.